# జై తెలంగాణా! జై ఆంధ్రా!!

బస్ స్టాండు కిరువైపులా అగ్నిహోత్రుడు వీర విహారం చేస్తున్నాడు. దుకాణాల ముందరి తెరలు కాలి, బట్ట కమురు వాసనను విశ్వ వ్యాప్తి చేస్తున్నాడు వాయుదేవుడు. ఆ మంటల్లో శివాలు దొక్కుతున్న మనుషులు శివరాత్రినాటి అగ్ని గుండాలను మరిపిస్తున్నారు. పీర్ల పండుగ నాటి అగ్ని గుండాలు దొక్కే దృశ్యాలను జ్ఞాపకం చేస్తున్నారు.

యెవడి చేతికి దొరికింది వాళ్ళు గుద్దా, పెద్ద యెత్తు కెత్తుతున్నారు. నల్లబజార్లో తప్ప దొరకని పంచదార వగైరా బజార్ల పాలు చేశారు. కిర్సనాయిలు రోడ్లమీద ప్రవహింప జేస్తున్నారు. బియ్యం బస్తాలకు బస్తాలు బజార్లపాలు జేశారు. డబ్బిచ్చేవాడు లేడు. పుచ్చుకునేవాడు లేడు. సరుకిచ్చే వాడు లేడు. పెద్ద దుకాణాలేమిటి ? బళ్ళమీద వ్యాపారంచేసి పొట్ట బోసు కునే వాడు కూడా ఇదే దుస్థితి పాలయ్యారు. తలుపు లేసుకోవడానికీ ఆ స్తి కాపాడుకోవడానికీ వాళ్ళ కాస్కారం లేదు. చిన్న వ్యాపారస్తులు లబో దిబో మంటున్నారు.

పట్టణ పెద్దల సమక్షంలోనే యిదంతా జరుగుతున్నది. ఒక్కడూ కిమ్మన్న పాపాన పోలేదు. దుకాణాల దోపిడీ అవుతున్నా లోన సంతోషం క్షణ భంగురం చేస్తున్నది. వాళ్ళ గ్రూపు వాళ్ళ దుకాణాల దోపిడీ - అంతా మాత్రం జై తెలంగాణా - జై ఆంధ్రా అని నినాదాలిస్తున్నారు. హోటళ్ళ అల్మారీల్లో తినుబండారాలు, అల్మార అద్దాలతోపాటు సఫా అయిపోయాయి. తిన్నవాడు బిల్లివ్వకపోతే ఊరోక్కవడానికి అలవాటు పడ్డ హోటలు వాళ్ళు దిగాలుపడి చూస్తున్నారు. ఈ బీభత్సానికి ఒకదేమిటి పక్షపాతం లేకుండా అందరూ గురి అయ్యారు.

ఈ సారి మా టౌన్‌లో గొడవలేమీ వుండవేమో ననుకున్నారు. యెందుకంటే తూర్పు ప్రాంతానికి పూనకం వచ్చినంతగా పడమటి ప్రాంతానికి శివం రాలేదు. యెంత గుగ్గిలం, సాంబ్రాణి పొగ వేసినా వూపు రావడం లేదు. వూగి వూగీ శాంతించింది. వేర్పాటు ఉద్యమం పుణ్యమా అని మా చదువు పాడయిందని విద్యార్థులు ముందుకు రావడం లేదు. వాళ్ళను కదిలిస్తే కరిచినంత పని జరుగుతున్నది. కేవలం జీతానికే యే వుద్యోగం జేయడంలేదు గనక ప్రభుత్వోద్యోగులకేం లక్ష్యంలేదు. జీతం నష్టమైనా పర్వాలేదు. త్యాగాలు చేయగలరు. వాళ్ళే కొద్దిగానో, గొప్పగానో వూపులోకి వస్తున్నారు. ప్రైవేటు ఆస్తి అంత పవిత్రమైనది కాదు. పబ్లిక్ ఆస్తి నష్టమైనా పోయేదేం లేదు. ఫలితం యేమైనా యేదో యింత రాకపోతుందనుకునే వీల్లేదు. అలాటి లాభాల్లో ప్రధానమైంది కొందరు యం. పి. లు, యం. యల్. ఎ. లతో బాటే మాజిల్లాకో మంత్రి గారు పుట్టుకురావడం జరిగింది. ఆయనగారి సన్నిధి స్వాములు ఆర్థికంగానే గాక అన్ని విధాలా పెరగడం జరిగింది. నాలుగు బస్సులు తగలబెట్టిస్తే మనకో మంత్రి పదవి దక్కేది. అమాంతం పది సంవత్సరాల వెనకబడి పోయామని మంత్రిగారి ప్రత్యర్థివర్గం చేతులు పిసుక్కున్నది.

సాయంత్రం టీ దాగడానికి బస్ స్టాండు హోటల్ కెళ్ళినప్పుడేమీ లేవు కాని తెల్లారే సరికి నాలుగైదు అంచల నిరాహార దీక్ష శిబిరాలు మొలుచుకొచ్చాయి. వాటిపైన మూడు రంగుల జండాలు, పసుపుపచ్చ రంగు జండాలు, సూర్యోదయం జండాలు రెపరెపలాడుతున్నాయి.

షామినాయాల్లో జంపఖానాలూ, కుర్చీలూ, నీళ్ళకుండలూ అమరించి వున్నాయి. నిరాహారదీక్ష వ్రతులతో కుర్చీలు కులుకుతూ వున్నాయి. వాళ్ళ మెళ్ళో పూలదండలు మెరుస్తూవున్నాయి.

వెంకటేశ్వర్లుగారు అంతటా తానుగా తిరుగుతూ వున్నాడు. హడావిడి చేస్తున్నాడు. అన్ని పార్టీల క్యాంపులవాళ్ళకూ అన్ని హంగులూ అమరిస్తున్నాడు. డబ్బూ దస్కం సర్దుబాటు చేస్తున్నాడు. యూనియన్ సెక్రేటరీల తలదన్నేటుగా పనిచేస్తున్నాడు. వెంకటేశ్వర్లు సమ్మెలో పాల్గొంటున్నాడంటేనే అందరికీ ఆశ్చర్యంగావుంది.

కరువు భత్యం కోసమని ఆంధ్రా వాళ్ళు, తెలంగాణావాళ్ళు కలిసి సమ్మె చేసినప్పుడే వులకలేదు పలకలేదు. తన్నులు తింటే తిన్నాడుగాని లాయల్టీ ఇంక్రిమెంటుతోబాటు ప్రమోషన్‌కూడా కొట్టేశాడు. కామధేనువు లాంటి యూరియా డిస్ట్రిబ్యూషన్ సెక్షన్ చేతికొచ్చింది. ఉద్యోగం లోనికి రాకముందే రాజకీయ నాయకుల పక్కల్లో రెక్కల్లో మెలిగాడు. అన్ని రకాల అనుభవాలు గడించాడు. దూరదృష్టితో ఈసారి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో దూకాడు. ప్రభుత్వమంటె ప్రభుత్వోగులు-ప్రభుత్వం ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తుంటే మనం ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాము. అందుకోసం మనం ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లే లెక్క అని, చదివి మరిచిపోని ఈ క్వేషన్ను ద్వారా రుజువు చేయగలిగిన ఘటం. రెండుప్రాంతాల ప్రభుత్వోద్యోగులూ వేర్పాటుగో ర్తున్నారంటే ప్రజలంతా కోరుతున్నట్లే లెక్క-1969లో అలాకాదు $\frac{1}{3}$ అవునంటే $\frac{2}{3}$కాదన్నారు. ఇప్పుడు$\frac{1}{3}$ + $\frac{2}{3}$కోరుతుంటే 'మియాబీవీ రాజీకరేతో క్యాకరే కాజీ!'సెంటరు చచ్చినట్లు వొప్పుకొని తీరుతుంది. మనవాళ్ల రాజ్యం వచ్చి తీరుతుంది. సమ్మె రోజుల జీతం, బోనస్ అన్నీ దొరికినట్టె లెక్క-అని వెనకపట్టు బట్టే వాళ్ళందరినీ కూడగట్టుకొచ్చాడు. కొందరు విద్యార్థుల సాయంతో కలిసిరాని వుద్యోగులను వూళ్లోనుంచి తరిమేయించాడు. అలాపోని మొండి ఘటం యెవరైనావుంటే వాని కర్మ ప్రకారం పెట్రోలు మంటల కాహుతయ్యాడు - దీని బాధ్యత వెంకటేశ్వర్లుగారి మీద వున్నదని కళ్ళూ, చెవులూ వున్న వాడెవడూ అనలేరు. ఇలా బొందితో కైలాసం పంపడం యే ఒక్క ప్రాంతానికో పరిమితంకాక అంతటా ఈ పుణ్య కార్యం జరుగుతూవున్నది. కనక యెవరేమీ అనడంలేదు. అంతా గప్‌చిప్‌గా జరిగిపోతూవున్నది. పోయిన రాజ్యాన్ని జయించిన వీరుడిలా విజయవిహారం సాగిస్తున్నాడు. యెత్తిన కత్తిని దింపని వీరుడిలా వెలిగిపోతున్నాడు. అందుకే ప్రత్యేక రాష్ట్ర పోరాటమంతా ప్రభుత్వోద్యోగులు, అందులో ముఖ్యంగా వెంకటేశ్వర్లుగారు తమ భుజాల మీద వేసుకొన్నాడు. తన చాకచక్యంతో నానా గోత్రీకులైన పార్టీల వాళ్ళందరినీ సమైక్యం చేశాడు. లాయర్లను, డాక్టర్లను దేశం ఒక్కటైనా ముక్కలైనా వాళ్ళకేం నష్టం లేదు కనక, వీళ్ళకూడా చదువుకున్న ప్రజలే కనక అందరినీ ఒక తాటి

మీదికి తెచ్చాడు. యెప్పుడూ కుంభకర్ణ నిద్రలోవుండే లాయర్ల, డాక్టర్ల సంఘాలు కూడా తీర్మానాలు చేశాయి.

శిబిరాల్లో లాయర్లు పత్రికలు తెచ్చి పడేశారు. డాక్టర్లు నిరాహారదీక్ష పోరాటపు ఆయుధాలైన నిమ్మకాయలు యెనిమాగొట్టాలు తెచ్చిపడేశారు.

"వచ్చే మున్సిపల్ ఎన్నికలకు యిప్పటినుంచే పెట్టుబడి పెడ్తున్నావ్ రోయ్" అన్నాడు ఒక గొట్టాం ప్యాంటు నిరాహారి. అతని తొడగిల్లి నోర్మూయించాడు కిష్టయ్యగారు. మాట మరిపించడానికి డాక్టరును మాటల్లోకి దించాడు.

"ఒక్కరోజుకే యెందుకండీ యీ నిమ్మకాయలు, యెనిమా గొట్టాలు డాక్టరుగారూ, మీకు జైలు అనుభవంలేనట్లున్నది." తనకా అనుభవంలేదని సూటిగా వొప్పేసుకున్నాడు డాక్టర్. ఈ ప్రత్యేకరాష్ట్రి ఆందోళనలోనైనా జైలు కెళ్ళి దేశ భక్తుడు కావాలని ఉబలాట పడ్తున్నాడు. కాని ప్రాక్టీసు దెబ్బతింటుందేమోనని భయపడ్తున్నాడు. కాని యిలా జైలు కెళ్ళితే రాజకీయ బాధితుడు అన్న పేరొస్తుందో రాదో అని అనుమానంలో పడి వెనకా ముందాడ్తున్నారు. కొందరి ఈ మనోభావాన్ని కనిపెట్టినట్లున్నాడు వెంకయ్యగారు.

"ఇది వరకున్న రాజకీయ బాధితులతోనే చచ్చిపోతున్నాం. కొత్త రాజకీయ బాధితులను గుర్తించవద్దని మొదటికి మొదలే ప్రకటన చేశాడు. ప్రత్యేక రాష్ట్రి ఆందోళనలో కొత్త రాజకీయ బాధితులు పుట్టుకొస్తారేమోనని భయపడ్డాడు పాపం హరిజన మైనారిటీ వెనకబడిన జాతుల 'లీగ్' అధ్యక్షుడు వెంకయ్యగారు. ఈ వెంకయ్యగారికీ డాక్టరుగారికీ రాజకీయ గురువునను కుంటారు కిష్టయ్యగారు. అప్పుడప్పుడు తాము నడిపే హాస్టలు విద్యార్థుల గొడవల్లో కిష్టయ్యగారిని కూడా సలహా అడుగుతుంటాడు.

కిష్టయ్యగారంటే మా వూళ్లో చాలా పాత రాజకీయ బాధితుడు. నిరాహారదీక్షల యెక్సపర్టు. యెవరే ఆందోళన తలపెట్టినా దాన్నిబలపరుస్తూ

బస్సు స్టాండులో ఆమరణ నిరాహార దీక్షకు సర్వదా తయారుగా వుంటాడు. బస్సుస్టాండులోనే ఎందుకయ్యా నిరాహార దీక్ష అంటే అందరూ చూడాలి, ఆకాశవాణిలో రావాలి గనుక, అంటారు గిట్టనివాళ్ళు. ఆయన్ను కదిలిస్తే చాలు పెద్ద పెద్ద నాయకులతో తనకున్న సావాసాలూ, జైళ్ళల్లో తన ఆమరణ నిరాహార దీక్షలూ, వాటి అనుభవాలూ విసుగు విరామం లేకుండా గంటలకొద్దిగా చెప్తాడు. లేచిపోదా మనుకున్నా పోనీయకుండా లాగి కూర్చోబెడ్తాడు. అన్నట్టు యిది విన్నావా, అని తన వూతపదం నిముష నిముషానికి వాడుతూ చెప్పుకపోతాడు.

"యెదుటివాణ్ని అనడానికి అంతా వొంటికాలిమీద లేస్తారు గాని ప్రతివానికీ ఒక వూత పదం వుంటుంది నోర్ముయవోయ్ పిచ్చినాయనా !!" అంటాడు యెవరైనా ఎగతాళి చేస్తే.

తనకున్న రాజకీయ జీవితానికి కనీసం మున్సిపల్ మెంబర్‌గిరీ అయినా ఇప్పించని నాయకుల కృతఘ్నతను దినానికి పదిసార్లైనా శపించనిది వదలడు. పదవుల్లో వున్నవాళ్ళ వాళ్ళు ఖద్దరు గట్టని కాలం సంగతులు చెప్పి వాళ్ళ నిజాంమీది భక్తినీ తెల్లవాడి మీది రక్తినీ కడిగిపోస్తాడు.

నీ వాగుడే నీ కపకారం చేస్తున్నదని కొందరం చెప్పాం. కొంత కొంత లౌక్యం అన్నది ఈ మధ్యనే వంటబట్టించుకుంటున్నాడు. అందుకే ఉపవాసాల క్యాంపు ఆదాయంలో యింతో అంతో గిట్టుబాటైందని ప్రతీతి. గోరంచు ధోవతుల్నుండి యం. యల్. ఎ. అంచు ధోతీ, జరీ కండవాకు ప్రమోషన్ సంపాయించుకున్నాడు కిష్టయ్యగారు. సాగర్ క్రింద దొరికిన రాజకీయ మాన్యంలో స్వంత వ్యవసాయం కూడా పెట్టుకున్నాడు.

ఇంత ఉత్సాహం వెల్లి విరుస్తున్నా – చిన్నబుచ్చుకున్నది కిష్టయ్యగారి స్నేహితుడు రంగయ్యగారొక్కడే!

ముప్పూటలా తినంది వుండలేదు గనుక ఉపవాసాలు చెయ్యలేడు గాని, ఉపన్యాసాలు మాత్రం ఇవ్వగలడు. అపశబ్ద భయం నాస్తిగా ప్రతి వాది భయంకరంగా ఉపన్యాసం దంచెయ్యగలడు. అందుకే అన్నీ కనిపెట్టిన వెంకటేశ్వర్లుగారు ఉపవాసశిబిరానికి ప్రారంభోపన్యాసకుడుగా రంగయ్య పేరు వేయించాడు. రంగయ్యగారి ప్రతాపరుద్రసేన వాలంటీర్లనూ, Z. P. ఛైర్మన్‌గారి చాణక్య సేన వాలంటీర్లతో బాటు దీక్షాపరుల్లో కూచో బెట్టాడు. పంచాయతీ ప్రసిడెంటుగారి పల్లవ సేన, M.L.A. గారి శాలి వాహన సేన, మున్సిపల్ ఛైర్మన్ గారి రాచకొండ సేన, M.P. గారి కొండవీటి సేనలనుగూడా తానే దగ్గర వుండి ఏ పక్షపాతం లేకుండా పంచాయతీలు రాకుండా అన్ని ఏర్పాట్లు చేయించాడు. కానిZ. P. ఛైర్మన్ గారు అంతా తలక్రిందులు చేశాడు. ఉపవాసం వుండటానికే గాని, ఉపన్యాసాలివ్వటానికి గాదు ఈ క్యాంపులు అని ప్రారంభోపన్యాసం అన్న ఎజండాలోని ఐటంను కొట్టిపారేశాడు. చేతనైతే ఉపవాసం చేయమన్నాడు ఉపన్యాస కేసరిని. ఉపన్యాసాలేమీ లేకుండా Z. P. ఛైర్మన్‌గారు, పంచా యతీ సమితి ఛైర్మన్‌గారు, M. L. A., M. P. గార్లతో సహా లేచి వెళ్ళారు. జై తెలంగాణా - జై ప్రత్యేకాంధ్ర అంటూ ఉపవాస దీక్షి తులుగా ఆసనాలను అలంకరించారు. పూల దండలేశారు. ఫొటోగ్రాఫర్లు క్యామరాలను క్లిక్ మనిపించారు. అందరి ఫొటోలు పడ్డాయో లేదోనని ఇంకో షాట్ తీశారు. ఫోటోలో పడనివారు తన ప్రాణం తీయకుండా ఎవరి జాగ్రత్త వారు పడ్డారు. పబ్లిక్ రిలేషన్స్‌వాళ్ళు ఈ వార్తను ఆకాశ వాణికి, పత్రికలకూ స్పెషల్ జీపులో పంపించారు. పత్రిక వ్యాన్ వాళ్ళని కూడా హెచ్చరించారు. రేపు ఈ వార్త తాటికాయలంత అక్షరాలతో ఫ్రంట్ పేజీలో వచ్చేటట్లు చేస్తామన్నారు. పాపం యిదివరకే వాళ్ళవి రెండు వ్యాన్లను అగ్నిహోత్రుడు ఉదయం టిఫిన్, ఇడ్లీ సాంబార్‌లా కాజేశాడు.

ఉపన్యాసాలంటూ వుంటే కొట్లాడైనా హడలగొట్టు నా రంగయ్య గారు. వేదిక నెక్కి తిడతాడు కనుక ఆ అవకాశం లేకుండా చేశారు Z. P. ఛైర్మన్‌గారు. అందరినీ సమైక్య పరచాల్సిన ఆవశ్యకతను

వెంకటేశ్వర్లుగారు చెవిలో ఇల్లు గట్టుకొని చెప్పినా లాభం లేకపోయింది. పైగా ప్రతాపరుద్రసేన వాళ్ళను చేరదీసినందుకు చీవాట్లు కూడా వేశాడు. ప్రతాపరుద్రుడు విశాలాంధ్ర వాది అని చరిత్రలో వుందని తెలుగు మాష్టారు చెప్పారట. అందుకోసం ప్రతాపరుద్రసేన సమైక్యసేన అవుతుంది, సెపరేటిస్టు సేన కానే కాదు, కాగూడదు అని రూలింగిచ్చారు Z. P. ఛైర్మన్ గారు. M. P. గారు, M. L. A. గారంతా డిటో అన్నారు. పూర్వం సమైక్యతమీద వుపన్యాస మిచ్చినట్లు సెపరేషన్ పైన బ్రహ్మాండం బద్దలయ్యే టట్లుగా ఉపన్యాసం పేను కొచ్చిన ఉపన్యాస కేసరి రంగయ్యగారికి నిజంగానే చెప్పలేనంత నిరాశా నిస్పృహలు యెదురయ్యాయి. శివుడు కాలకూటాన్ని మింగినట్లుగా ఆవేశాన్ని దిగమింగారు. చివరకి సభవారికో చిన్న రిక్వెస్టు చేశారు.

"నా కవకాశం యిస్తే ప్రతాపరుద్రుడు పక్కా సెపరేటిస్టు అని రుజువు చేస్తాను. నా సేన తప్ప తక్కినసేన లన్నీ వేర్పాటువాదానికి వ్యతిరేక చిహ్నాలు.

— ప్రతాపరుద్రుడే గదరా నాయనా, కాకతీయ సామ్రాజ్యాన్ని ముక్కచెక్కలు చేసింది. మలిక్కాఫూర్ వచ్చిందెప్పుడూ, ఛైర్మన్ గారికి చరిత్ర చెప్పాల్సింది తెలుగు మాస్టరా, అయ్యో, దేశమా నీ కెంత కర్మ పట్టింది, అక్కటక్కటా" అని రాజువేషం పోజులో సభవారిముందు దోసిలొగ్గి నిల్చున్నాడు.

"పూర్వం చెప్పిన హరికథలు జ్ఞాపకం వస్తున్నాయి ఉపన్యాస కేసరికి. లాగండిరా వీణ్ణి వెనక్కి" అన్నారు ఎం. ఎల్. ఏ. గారు.

"లక్షలు ఖర్చుపెట్టి ఎం. ఎల్. ఏ. లు, ఎం. పీ. లు అయ్యారు. వీరికి ఉపన్యాసం యివ్వొస్తుందా పాడా, జీతభత్యాలు తినడమే తప్ప ఒక్కనాడైనా పల్లెత్తి మాట్లాడిన పాపాన పోతేకదా. జెడ్. పి. ఛైర్మన్ రాసు

కొని చదువుతాడు. పంచాయతీ సమితి ప్రెసిడెంట్ తరపున బి.డి.వో. మాట్లాడుతాడు. మునిసిపల్ ఛైర్మన్ శుద్ధమొద్దుకు మారురూపం. ఉపన్యాసాలు యివ్వరావడం పూర్వజన్మ సుకృతం. వెధవాయలకేం తెలుస్తుంది." రౌద్రాకారంలో అనర్గళంగా సమాసాలకు సమాసాలు కామాలు, ఫుల్‌స్టాపులు లేకుండా మాటలు వదిలాడు.

"నీ తలకాయ తిరుగుతున్నది. కోడిమెడ విరచినట్లు విరిచేస్తా దొంగ నా కొడకా" అని జెడ్. పి. ఛైర్మన్‌గారి సేన ఉపన్యాస కేసరి మీదికి లంఘించింది.

"నీ డొక్క చీల్చి డోలుకడతాం" అని ఎం. ఎల్. ఏ. గారిసేన వుపన్యాసకేసరిని ఘోరావో చేసింది.

"కిందటిసారి సమైక్యత అని, ఇవాళ ప్రత్యేకత అంటున్నాడు లుచ్ఛాగాడు" అని అష్టోత్తరశతం వడ్డించింది మునిసిపల్ ఛైర్మన్‌ముఠా.

"మంత్రిపదవి ఖాయం చేసుకోవడానికి సెపరేట్ అంటున్నాడు. వీణ్ణి మనలోకి చేరనియ్యవద్దంటే మీరెవరూ నామాట వినలేదు" అని మునిసిపాలిటీ ఛైర్మన్ చేతులు పైకిలాగి యుద్ధానికి లేచాడు.

ఎం. పి. గారు ఆయన్ని లాగి కూర్చోబెట్టారు.

"మనం నోరు చేసుకోగూడదు, చేయి చేసుకోగూడదు. ఆ పని చేయాల్సినవాళ్ళు వేరే ఉన్నారు. అనవసరంగా ఎందుకయ్యా తొందర పడ్డావు" అని ఎం. ఎల్. ఏ. గారు నెమ్మదిగాచెప్పి కూర్చోబెట్టాడు.

"నీకేం తెలుసోయ్, వంకాయ పులుసు" అని ఎం. పి. గారిని, ఎం. ఎల్. ఏ. గారిని పడతోసి ముందుకెళ్ళాడు, మునిసిపాలిటీ ఛైర్మన్. ఎం.ఎల్.ఏ.గారు, ఎం.పి. మీదపడ్డాడు. లేవదీయడానికి పంచాయతీ సమితి ప్రెసిడెంట్ భారదేహుడైన ఎం. ఎల్. ఏ. గారిని లాగుతున్నాడు. వెంక

శ్వర్లు అందరినీ శాంతి శాంతి అని చేతులు జోడించి బ్రతిమిలాడు తున్నాడు. పంచాయతీ సమితి ప్రసిడెంట్ లాగుడుకు ఎం. ఎల్. ఏ. గారి ఖద్దరు టెర్లిన్ చొక్కా చినిగిపోయింది. ఎం. పి. గారి ఖద్దరు టెరికాట్ లాల్చీకూడా చినిగింది.

"పాతపగ సాధించుతున్నాడురోయ్ పంచాయతీ సమితి ప్రెసిడెంట్" అని ఎం. పి., ఎం. ఎల్. ఏ. గార్లు యిద్దరూ గోలకెత్తారు. సమితి ప్రెసిడెంట్‌గానూ, సెపరేటిస్టుగానూ గెలవకపోతానా - అని ఎం. పి. సీటుకూ, ఎం. ఎల్. ఏ సీటుకూ పోటీ చేసి వోడిపోయాడు. సమితి ప్రసిడెండ్ పదవిమటుకు ఖాయంగా వుండిపోయింది.

"ఏదైనా ప్రశాంతంగానూ, అహింసాయుతంగానూ జరగాలి. సమైక్యతావాదుల ముందు, పలచనయే పని చేయరాదు" అన్న కిష్టయ్యగారి కేకలు యెవరూ వినిపించుకోలేదు.

పెద్ద మనుషులు ఆవేశంలో వున్నారు. చేతులు చేతులు కలిశాయి. మునిసిపల్ ఛైర్మన్, ఎం. ఎల్. ఏ., ఎం. పి., సమితి ప్రెసిడెంట్‌గారి సైన్యాలు తమ నాయకుల రక్షణకు కదిలాయి. ఆత్మరక్షణతోపాటు శత్రువుపై దాడికూడాచేస్తే తట్టుకొట్టు సిద్ధాంతం ఆచరణలో కొస్తుంది. అలాగే జరిగింది. అంతఃపుర కల్లోలం అంతర్యుద్ధంగా పరిణమించింది. ఎం. పి. గారి ముఠావాళ్ళ దుకాణాలను, ఎం. ఎల్. ఏ. గారి ముఠా, వీళ్ళిద్దరి శిష్యవర్గం దుకాణాల సామాన్లను, మునిసిపల్ ఛైర్మన్‌ముఠా తీసుకుపోయింది. పరస్పరం అదిలీ బదిలీలు జరిగాయి. బస్‌స్టాండుకు యిరువైపులావున్న దుకాణాలు పాతపగల కాహుతయినాయి. ఏ తగాదా పడని పచ్చ జెండా వాళదుకాణాలు కూడా పంచ బంగాళమైనాయి. తమతో పాటు రెండు ఆర్. టి. సి. బస్సులను గూడా అగ్నిదేవుడికి ఆహారంగా సమర్పించాయి. శిబిరం అంతర్యుద్ధ శిబిరంగా మారింది. దక్షయజ్ఞం జరిగిన దానికన్నా యెక్కువ బీభత్సమే జరిగింది.

Z. P. ఛైర్మన్‌గారు ఫోన్ చేసినా పోలీసులు రానేలేదు. అలా వాటు ప్రకారం అంతా అయ్యాక పంచనామాకోసం వచ్చారు. 'పాలక వర్గంలో తగాదా' రేపెవరు అధికారంలో కొస్తారో యేమో, సెపరేషన్ అయితే తాము దేశభక్తులపైన దొంగ కేసుపెట్టి సతాయించామని కక్ష సాధిస్తే యెవడు దిక్కు ? కరవమంటే కప్పకు కోపం, విడవమంటే పాముకు కోపం, ప్రదేశంమీద వుండకపోవడమే ప్రత్యేక రక్షణ అనుకున్నారు పోలీసులూ, అధికార్లూ. రెవెన్యూ వాళ్ళూ అంతే చేశారు.

వెంకటేశ్వర్లుకు యజ్ఞం చేసినంత పనైంది. "బ్రదర్, రాజకీయ నాయకులంతా రసాభాస చేశారు. వేర్పాటుకోసం సాధించిన సమైక్యతనంతా చట్టుబండలు చేశారు. వాళ్ళ పాత పగలు ఒక్కనాటితో ఎలా పోతాయి?" అని నోరూ నొసలూ బాదుకున్నాడు. ఏదేమైనా తన యూరియా పంపకం సెక్షన్ చేజారి పోకుండా వుండడానికి కావలసిన పుణ్యం అంతా సంపాయించుకున్నాడు. అదొక్కటే మిగిలిపోయిన సంతృప్తి.

(1972).

సి.పి. బ్రౌన్ స్మారక గ్రంథాలయం, కడప
ప్రవేశ సంఖ్య 25093